

టమోత మోగింది..

పెంటపాడు, జూన్ 23 : టమోటా ధర మోత మోగిస్తోంది. రెండు నెలలుగా కిలో రూ.20 పలికిన ధర నేడు..రూ.80 పైనే ఉంది. ఈ ధరలను చూసి సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిత్తూరు జిల్లా మదన పల్లె, అనంతపురం, పోలవరం తదితర ప్రాంతాల నుంచి టమోటా దిగుమతి అవుతుంది. వాతావరణ మార్పుల కారణంగా ఈ సీజన్‌లో దిగుబడి పడిపోవడంతో ధరలకు రెక్క లొచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు. హోల్‌సేల్‌లో 25 కిలోల ట్రే రూ.1700కు విక్రయిస్తున్నారు. ఈ ట్రేలో సుమారు రెండు నుంచి మూడు కిలోల టమోటాలు నలిగిపోయి పాడవుతాయి. దీంతో రిటైల్ వ్యాపారులు రూ.80కు అమ్మకాలు సాగిస్తున్నారు. గతేడాది ఇదే రోజుల్లో వీటి ధర కేజీ రూ.200 వరకూ పలికింది. తిరిగి ఈసారి పెరుగుదల కనిపిస్తోంది. అత్యవసరమైతే తప్ప ఎవరూ వీటిని కొనుగోలు చేయడం లేదు.

నేడు ఎంపీగా శ్రీనివాసవర్మ ప్రమాణ స్వీకారం



భీమవరం టౌన్, జూన్ 23 : నరసాపురం పార్లమెంట్ నుంచి ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాసవర్మ సోమవారం ఎంపీగా ప్రమాణ స్వీకారం చెయ్యనున్నారు. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆయన లోక్‌సభలో ప్రమాణం స్వీకారం చేస్తారు. ఇప్పటికే కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చెయ్యడంతో పాటు బాధ్యతలను కూడా చేపట్టారు. దాంతో పాటుగా ఎంపీగా ప్రమాణ స్వీకారం చెయ్యవలసి ఉంది. లోక్‌సభలో శ్రీనివాసవర్మ ప్రమాణ స్వీకారం చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆసక్తి చూపుతున్నారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

భీమవరం, జూన్ 23 : భీమవరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించనున్నారు. ద్వారా ప్రజల నుంచి ఉదయం 10 గంటల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర్‌రావు ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పేదోడికి ఇంటిస్థలం కావాలంటే అడుగుల్లో లెక్క కడతారు. ఆచితూచి సరి పెట్టుకోమంటారు. ఏదో సందు చివర బతకడానికి ఇరవై, ముప్పై అడుగుల్లో ఓ షెడ్డు వేసుకుంటే అధికారులంతా క్షణాల్లో వచ్చి వాలిపోతారు. పక్కా ఇల్లు కట్టాలంటే అంతకంటే పక్కాగా మా సంగతేంటని అని అడుగుతారు. కానీ పార్టీ కార్యాలయ భవనాలకు ఎలాంటి అనుమతులు లేకున్నా ఏమీ తెలియనట్టు ఉంటారు. అధికారంలో ఉండగా వైసీపీ ప్రభుత్వం సొంత పార్టీ కార్యా లయాల కోసం అడ్డదారులు తొక్కింది. అవినీతికి పాల్పడింది. అనుమతుల లేకపోయినా అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టింది.. కనీసం దరఖాస్తులు కూడా చేయలేదు. అంతేకాదు కోట్ల విలువ చేసే స్థలాలకు వందల్లో లీజు చెల్లిస్తూ గలీజు వ్యవహారాలకు దిగింది.. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం ఎన్‌ఆర్‌పీ అగ్రహారం, ఏలూరు జిల్లాలో నడిబొడ్డున అధికార వైసీపీ పార్టీ కార్యాలయాల నిర్మాణాల ముసుగులో జరిగిన చిత్ర విచిత్ర విన్యాసాలు.



ఉండి మండలంఎన్ఆర్‌పీ అగ్రహారంలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం

గలీజు దందా !

కోట్ల విలువ చేసే భూములకు వందల్లో లీజులు

- వైసీపీ కార్యాలయాల నిర్మాణంలో జగన్మాయ
- అనుమతులు లేవు.. దరఖాస్తులు అంతకంటే లేవు
- ఉండిలో 72 సెంట్ల స్థలానికి నెలకు రూ.720 అద్దె
- ఏలూరులో 20 కోట్ల భూమికి ఏడాదికి రూ.2 వేలు
- అది కూడా 33 ఏళ్ల పరిమితికి లీజులు
- అడిగే దిక్కులేదు..చూసే ధైర్యం లేదు
- అధికారులు, సిబ్బందీ అంతా మౌనమే
- వైసీపీ చిత్ర విచిత్ర విన్యాసాలు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సాధారణంగా ఎక్కడైనా భూమి లీజుకు ఇవ్వాలంటే కొన్ని నిర్దిష్టమైన మార్గదర్శక సూత్రాలను పాటిస్తారు. భూమి విస్తీర్ణం ఆ ప్రాంతానికి ఉన్న విశిష్ఠత, రోడ్డుమార్గం, రైల్వే, బస్సు సౌకర్యం వీటన్నింటిని లెక్క కడతారు. కాని అధికారంలో ఉండగా తమ పార్టీకి సొంత భవనం నిర్మించుకోవడానికి కాస్తంత స్థలం ఇవ్వాలని అడిగిన వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించింది. కోట్ల విలువైన భూమిని పార్టీకి లీజు పేరిట అప్పగించింది. అధికార పార్టీకి చెందిన భవనం కాబట్టి అనుమతులు అవసరం లేదు. ఎవరి పరిశీలనలు అంతకంటే అవసరం లేదు. తమంతట తాముగా నిర్దేశించి, డిజైన్ చేసిన భవనాలను నిర్మిస్తున్నా, పక్కాగా నిబంధనలు కాలరాస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం అంతా సవ్యంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఎక్కడా నిబంధనల మాత్రం పట్టించుకోలేదు. ఎక్కడా ఎవరికి అక్రమ కట్టడం అంటూ నోటీసులు ఇవ్వలేదు. అసలు ఇదంతా తమ పరిదే కాదు అన్నట్లుగా వ్యవహరించారు.

ఏలూరులో రాజ్‌మహల్‌ను తలపించే రీతిలో

అధికారం ఉంటే చాలు, ఏదైనా చేయవచ్చు. ఏలూరు నగరంలో సీతారామరాజు స్టేడియం పక్కనే ఉన్న కోట్ల విలువ చేసే రెవెన్యూ భూమిపై 2022లోనే అధికార వైసీపీ కన్నేసింది. రెండు ఎకరాల భూమిని పార్టీ ఆస్తిగా మార్చి ఆ స్థలంలోనే అద్భుత ప్యాలెస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2022 సంవత్సరం మేలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వమే అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కోట్ల విలువచేసే రెండు ఎకరాల భూమిని వైసీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి దారాదత్తం చేశారు. ఇంకేముంది ఏడాదిలోపే నిర్మాణానికి వీలుగా భూమిని తీర్చిదిద్దారు. 2023 జనవరిలో అట్టహాసంగా జగన్ పార్టీనేతలు శంకుస్థాపన చేశారు. మూడో కంటికి తెలియకుండా గప్‌చిప్‌గా జీ+1 భవన నిర్మాణం చేపట్టారు. రాజు తలుచు కుంటే దెబ్బలకు కొదువా అన్నట్లుగా నిర్మాణ సామాగ్రి, దానంతట అదే వచ్చి వాలింది. పార్టీ కార్యాలయానికి ఎందుకు ఈ హంగామా అని సొంత పార్టీ నేతలు ప్రశ్నించినా జగన్ సార్ నైట్‌హాల్ట్ చేయాలన్నా, పగటి వేళల్లో జిల్లా సమీక్షలు చేయా లన్నా ఇంత భవనం కావాలి కదా అంటూ సర్దిచెప్పారు. ఈ రెండు ఎకరాల భూమి విలువ అధికారిక లెక్కల ప్రకారమే ఐదుకోట్ల పైబడి ఉండగా, పెద్దరైల్వేస్టేషన్ ఎదురుగానే ఉన్న ఈ భూమి విలువ సరాసరి రూ.20 కోట్లకు పైబడే. అంత విలువైన భూమిని పార్టీ అవసరాలకు దారాదత్తం చేయటానికి యంత్రాంగం కూడా ఎక్కడా అభ్యంతరం చెప్పలేదు. ఆఘమేఘాల మీద భూమి కేటాయింపు దగ్గర నుంచి లీజు నిర్ణయించే వరకు చకాచకా కానిచ్చేశారు. ఇంతకూ 20 కోట్లు విలువ చేసే భూమి లీజు మాత్రం ఏడాదికి రూ.2 వేలు. అది కూడా 33 ఏళ్ల లీజుకు ఇస్తున్నట్లు అంతా ఓకే చేసేశారు. ఏకంగా 13 వేల చదరపు అడుగుల్లో అంటే దాదాపు అతిపెద్ద కార్యాలయ నిర్మాణానికి ఎలా లేదన్నా రూ.ఐదు కోట్లు వెచ్చించి రాజ్‌మహల్‌ను తలపించే రీతిలో చేపట్టారు నిన్న, మొన్నటివరకు బయటకు ఎవరికి కనిపించకుండా పరదాలతో దీన్ని కప్పి ఉంచారు. ఇప్పటికే 80 శాతం పూర్తయిన ఈ ప్యాలెస్‌ను త్వరలోనే అందు బాటులోకి తెద్దామన్నా వైసీపీ కలలు కలలైపోయాయి. అంతకంటే మించి పార్టీ కార్యాలయ భాగోతం వెలుగుచూసింది.



ఇంద్ర భవనాన్ని తలపిస్తున్న ఏలూరులో నిర్మించిన వైసీపీ కార్యాలయం

72 సెంట్లు.. రూ.720లకే

ఉండి, జూన్ 23 : అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నారంటూ పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీ నేతలు గత ఐదేళ్లలో నానా యాగీ చేశారు. దందాలు నిర్వహించారు. కమీషన్‌లకు కక్కుర్తిపడ్డారు. నిర్మాణ రంగాన్ని వైసీపీ నేతలు తమ గుప్పెట్లోకి తీసకున్నారు. నిర్మాణాలు తప్పుగా చేస్తున్నారంటూ జులుం ప్రదర్శించారు. అయితే తన సొంత కార్యాలయాల విషయంలో నిబంధనలు తుంగలో తొక్కారు. ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారంలో జిల్లా కార్యాలయం నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించింది. పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని నామమాత్రపు లీజుకు తీసుకుంది. అధికారుల మెడపై కత్తి పెట్టి వైసీపీ పేరుతో డాక్యుమెంట్స్ సృష్టించుకున్నారు. ఎన్ఆర్‌పీ అగ్రహారంలో 72 సెంట్ల స్థలాన్ని జిల్లా పార్టీ కార్యాయలం కోసం రెవెన్యూ శాఖ నుంచి బలవంతంగా లాగేసుకున్నారు. గతంలో ఆ రెవెన్యూ స్థలంలో హౌసింగ్ కార్పొరేషన్ కార్యకలపాలు నిర్వహించేది. పేదల ఇళ్ల కోసం ద్వారాలను తయారు చేసేవారు. ఇటీవల కాలంలో ఖాళీగా ఉంది. దాంతో వైసీపీ కన్ను దానిపై పడింది. వాస్తవంగా ఆదే స్థలాన్ని పేదల ఇళ్ల కోసం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ప్రభుత్వం కన్ను పడింది. పేదల కోసం స్థలాన్ని లీజలకు తీసుకుంది. వేరే స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఉండిలో ఉన్న 72 స్థలాన్ని 32 రెండేళ్ల లీజు పేరుతో వైసీపీ పేరున రాసుకున్నారు. అక్కడ పార్టీ కార్యాలయ నిర్మాణం చేపట్టారు. సెంటు స్థలానికి కేవలం పది రూపాయల లీజుకు రెవెన్యూ శాఖ వైసీపీకి స్థలాన్ని అప్పగించింది. 72 సెంట్ల స్థలం నెలకు 720 రూపాయలకు 32 సంవత్సరాలకు అడ్డకోలుగా అనుమతి ఇచ్చేసింది. పంచాయతీలో తీర్మానం పెడితే వైసీపీకి స్థలం ఇచ్చేందుకు అంతా వ్యతిరేకించారు. అధికార వైసీపీ పంచాయతీ తీర్మానాన్ని పట్టించుకోలేదు. రెవెన్యూశాఖ ఆ భూమిని వైసీపీకి అప్పగించేసింది. పంచాయతీ అనుమతి ఇవ్వలేదు. భవన నిర్మాణానికి ఏలూరు అర్బన్ డవలప్‌మెంట్ అథార్టీ నుంచి అనుమతి తీసుకులేదు. ఇలా అధికార పార్టీ అడ్డగోలుగా వ్యవహరించి అక్రమ నిర్మాణానికి పాల్పడింది. ఇప్పుడు ఆ అక్రమ వ్యవహారాలన్నీ బయట పడుతున్నాయి



త్రిశంకు స్వర్గంలో విలీన గ్రామాలు



- ఇటు పట్టణాల్లో కలవక..గ్రామాల్లో చేరలేక
- ఆర్థిక సంఘ నిధులు నిల్..
- ఉపాధి పనులకు గండి
- కోర్టులను ఆశ్రయించిన గ్రామస్థులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23 : పట్టణాల్లో విలీనం చేస్తున్నామంటూ గత ప్రభుత్వం జిల్లాలో 22 గ్రామాలను నాలుగేళ్లగా త్రిశంకు స్వర్గంలో నెట్టింది. ఒక పక్క పట్టణాల్లో కలవలేక.. గ్రామాల్లో ఇమడ లేక రెంటికీ చెడ్డ రేవడిలా ఆ గ్రామాలు కొట్టుమిట్టాడుతునాయి. ఫలితంగా ఇటు పారిశుధ్యం నుంచి మంచినీటి సరఫరా వరకూ అన్నింటా వివక్షగానే మిగిలి పోతున్నాయి. ఈ గ్రామాల్లో ఇప్పటికీ ఎన్నికలు జరగకుండా ప్రత్యేక అధికారుల పాలనలో ఉండడంతో పాటు నిధులు రాకపోవడంతో కేవలం పన్నులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఎదురైంది.

ఆర్థిక సంఘం నిధులు సున్నా

విలీన ప్రతిపాదన గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ జరగని దృష్ట్యా ఆ గ్రామాలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సంఘ నిధులకు గండి పడింది. దీంతో ఆయా గ్రామాల్లో నిధులు లేక అభివృద్ధి కుంటుపడింది. సిబ్బందికి జీతాలు అందించడానికి నానా పాట్లు పడాల్సిన పరిస్థితి ఎదురైంది. జిల్లాలోని 22 గ్రామ పంచాయతీల్లో 85 వేల మంది జనాభా ఉండగా ఆయా గ్రామాల్లో మైనర్ పంచాయతీకి ఏడాదికి రూ.10 లక్షల వరకు, మేజర్ పంచాయతీలకు 20 లక్షల వరకూ ఆర్థిక సంఘ నిధులు విడుదలయ్యేవి. ఆ నిధులను అభివృద్ధి పనులకు ఉపయోగించుకుని, పన్నుల రూపంలో వచ్చిన నిధులు మంచినీరు, పారిశుధ్య నిర్వహణ, తదితర అవసరాలకు ఉపయోగించుకునే అవకాశం ఉండేది. కానీ అభివృద్ధి పనుల మాటేమో కానీ సాధారణ పనులు కూడా చేయలేని దుస్థితిలో ఆ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి.

ఉపాధి పనులు నిల్..

పట్టణాల్లో విలిన ప్రతిపాదన తీసుకురావడంతోనే ఆ గ్రామాల్లో కూలీలు ఉపాధి కోల్పోయారు. దీంతో ఆయా గ్రామాల్లో కూలీలు ఉపాధి లేక తీవ్ర ఆందోళనలో పడ్డారు. తమ గ్రామాన్ని పట్టణంలో కలిపితే తమకు ఒరిగేదేమీ లేదని తమకు ఏళ్ల తరబడి ఉపాధికి ఊతం ఇచ్చిన పథకం తమకు లేకుండా పోయిందని కూలీలు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు గతేడాది తూతూ మంతంగ్రా ఉపాధి పని కల్పించే ప్రయత్నం చేసినా అది అంతంత మాత్రమే.

కోర్టులో కేసులు..

గ్రామాలను పట్టణాల్లో విలీనం చేసే ప్రక్రియ తమ ఇష్టంతో జరగలేదని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన సమయంలో తీర్మాణాలు తీసుకున్నారని ఈ ప్రక్రియకు కనీసం గ్రామసభ కూడా నిర్వహించలేదని ఆయా గ్రామాల వారు కోర్టును ఆశ్రయించారు. నరసాపురం పట్టణంలో సరిపల్లె, రుస్తుంబాద, లక్ష్మణేశ్వరం, భీమవరం సమీపంలోని రాయలం, చిన అమిరం, తాడేరు, కొవ్వాడ అన్నవరం, పాలకొల్లు సమీపంలోని పూలపల్లి, భగ్గేశ్వరం, ఉల్లంపర్రు, వరిధనం, ఆగర్తిపాలెం, తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు, పడాల, కుంచనపల్లి, కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం, తణుకు సమీపంలోని పైడిపర్రు, వెంకటాపురానికి చెందిన గ్రామ పంచాయతీల ప్రజలు కోర్టును ఆశ్రయించారు. వారితో పాటు తమకు ఉపాధి లేకుండా పోతున్నదని ఉపాధి కూలీలు, గ్రామాల్లో చిన్న చిన్న పరిశ్రమలు పెట్టుకుని జీవిస్తుంటే పట్టణాలుగా మారిస్తే తమకు ట్యాక్స్‌లు పెరిగిపోతాయని ఆయా గ్రామాల్లోని ఫ్యాక్టరీల యజమానులు కోర్టును ఆశ్రయించారు. దీంతో నాలుగేళ్లగా ఈ వ్యవహారం కోర్టులోనే నానుతోంది. ఫలితంగా ఆయా గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ ఎన్నికలు లేక ప్రత్యేక అధికారుల చేతుల్లోనే పాలన సాగుతోంది.

ప్రత్యేక అధికారుల కోసం ఎదురుచూపులు

గ్రామాల్లో ఏ చిన్న అవసరం వచ్చినా గ్రామంలోని వార్డు సభ్యులను కానీ, సర్పంచ్‌లను కాని సంప్రదిస్తే ప్రజల సమస్యలు తీర్చడానికి అవకాశం ఉంటుంది. కానీ ఏళ్ల తరబడి ప్రత్యేక అధికారుల పాలనలో సాగడం వల్ల ప్రజల సమస్యలు చెప్పడానికి ప్రత్యేక అధికారుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రత్యేక అధికారి అంటే మండల స్థాయి అధికారులకే ఈ అధికారాలు ఉండటంతో వారు మండలస్థాయి పనులు చూసుకుంటారా లేక గ్రామాల సమస్యలపై దృష్టి పెడతారా అని ప్రజలు వాపోతు న్నారు. దానికి తోడు ఈ అధికారుల పాలనలో గ్రామాల్లో నిధుల దుర్వినియోగంపై కూడా చాలా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గాలికి కొట్టుకుపోయిన కోట్లు

జిల్లాలో విలీన ప్రతిపాదిత గ్రామాలుగా ఉన్న 22 గ్రామ పంచాయితీలలో 85 వేల మంది జనాభా ఉంటున్నారు. ఆర్థిక సంఘ లెక్కల ప్రకారం ఏడాదికి రెండు విడతలుగా ఒక్కో మనిషికి రూ.222 చొప్పుల కేటాయిస్తారు. మూడేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీల పాలన సాగుతుండగా మొత్తంగా రూ.5 కోట్ల 60 లక్షలు గాలికి కొట్టుకుపోయాయి. వీటికి తోడు పంచాయతీలకు రావాల్సిన అదనపు నిధులు నిర్వీర్యం అయిపోయాయి.



వస్తోంది.. వందేభారత్

భీమవరం-చెన్నైల మధ్య ప్రతిపాదనలకు పచ్చజెండా

నరసాపురం, జూన్ 23: జిల్లావాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ త్వరలో భీమవరం వరకు రానుంది. ప్రస్తుతం చెన్నై-విజయవాడల మధ్య నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్ భీమవరం వరకు పొడిగించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించింది. దీనికి చెన్నై సెంట్రల్ రైల్వే పచ్చజెండా ఊపింది. ఈ రైలు ఏప్రిల్‌లోనే పట్టాలెక్కాల్సి ఉంది. అయితే ఎన్నికల కారణంగా పెండింగ్ పడింది.అన్నీ అనుకూలిస్తే వచ్చే నెలలో ఈ రైలు భీమవరం వరకు దూసుకురానుంది. ప్రస్తుతం విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య మెయిన్‌లైన్‌లో వందేభారత్ నడుస్తోంది. అయితే ఏలూరు జిల్లాలో ఎక్కడా దీనికి స్టాప్ ఇవ్వలేదు. గతంలో ఏలూరు, తాడేపల్లి గూడెంలో హాల్ట్ ఇవ్వాలని ప్రతి పాదించినా ఇంతవరకు ఆనుమతి రాలేదు. దీంతో జిల్లా వాసులు ఈరైలు ఎక్కా లంటే విజయవాడ లేదా రాజమండ్రి వెళ్లాల్సి వస్తున్నది.

ప్రస్తుతం చెన్నై-విజయవాడ మధ్య

ప్రస్తుతం చెన్నై విజయవాడల మధ్య నడుస్తున్న ఈ రైలును భీమవరం వరకు పొడిగిస్తారు. ఇది చెన్నైలో ఉదయం 20677 నెంబర్‌తో 5.30కి బయలుదేరుతుంది. విజయవాడకు మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకుంటుంది. తిరిగి 3.20కి 20678 నంబర్‌తో చెన్నై వెళ్లుతుంది. ప్రస్తుతం ఈ రైలు విజయవాడ స్టేషన్‌లో దాదాపు 3.10 గంటలు నిలిచిపోతుంది. ఈ రైలు కోసం ప్రత్యేకంగా ఒక ప్లాట్‌ఫాం కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే విజయవాడ జంక్షన్‌లో రైళ్ల రద్దీ దృష్ట్యా ప్రత్యేకంగా ఒక ప్లాట్‌ఫాం కేటాయించడం కష్టంగా మారింది. దీనివల్ల ఆనేక రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు దక్షిణ మధ్య రైల్వే వందేభారత్ రైలును భీమవరం వరకు పొడిగించాలని ప్రతిపాదించింది. దానికి చెన్నై రైల్వే కూడా అనుమతి ఇవ్వడంతో జిల్లాలో వందేభారత్ కూత వినిపించనుంది. విజయవాడ నుంచి గంటలో భీమవరం చేరుకుంటుంది. తిరిగి ఇక్కడ నుంచి 2 గంటలకు బయలుదేరి విజయవాడ వెళ్లే విధంగా షెడ్యూల్ చేశారు. చెన్నై వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా రాత్రి 10 గంటలకు సెంట్రల్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. ప్రస్తుతం జిల్లా నుంచి చెన్నైకు సర్కార్ మాత్రమే నడుస్తోంది. ఇది కూడా కాకినాడ నుంచి బయలుదేరి తణుకు, భీమవరం, ఆకివీడు మీదుగా వెళ్లుతుంది. దూర ప్రాంతం నుంచి రావడంతో ఈ రైలులో టిక్కెట్లు దొరకడమే కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో పగటి పూట వందేభారత్ వస్తుండటంతో ఒంగోలు, నెల్లూరు మీదుగా చెన్నై ప్రయాణికులకు కొంత ఊరట లభించనుంది.

ట్రాక్ పనులు పూర్తి

అత్యంత వేగంగా నడిచే ఈ రైలు జిల్లాకు వస్తుండటంతో రైల్వే అధికారులు ట్రాక్ పటిష్ట పనుల్ని దాదాపుగా పూర్తి చేశారు. విజయవాడ- భీమవరం మధ్య పాత ట్రాక్‌లను తొలగించి చాలాచోట్ల కొత్త ట్రాక్‌లు వేశారు. రైలు ఎంత వేగంగా వెళ్లినా తట్టుకునే విధంగా పట్టాల కింద ఉండే సిమెంట్ స్లీపర్స్ కూడా చాలాచోట్ల మార్చారు. మరోవైపు రెండేళ్ల క్రితం విజయవాడ- నరసాపురం మధ్య డబ్లింగ్ లైన్ పనుల్లో భాగంగా ఒక లైన్ కొత్త ట్రాక్ వేశారు. అంతకు ముందు మొదటి లైన్‌లో ఉన్న పాత ట్రాక్‌ను కూడా మార్చడంతో రెండు లైన్లలోనూ వందేభారత్ దూసుకెళ్లే విధంగా పనులు పూర్తి చేస్తున్నారు.

ఇంకా ఖరారు కానీ హాల్ట్‌లు

భీమవరం నుంచి విజయవాడ వరకు ఈ రైలు ఏఏ స్టేషన్ల మధ్య ఆగుతుందన్నది ఇంకా ఖరారు కావాల్సి ఉంది. భీమవరం దాటితే ఆకివీడు, కైకలూరు స్టేషన్లు రానున్నాయి. జిల్లాలో వాణిజ్య పరంగా ఆకివీడు స్టేషన్ అతి పెద్దది. అలాగే కైకలూరుకు కూడా స్టాప్ ఇస్తే ఏలూరు నుంచి చెన్నై వెళ్లే ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది.

'తల్లికి వందనం' ప్రభుత్వ బడులకే పరిమితం చేయాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 23: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింప చేయడం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరచడమేనని ఐక్య ఉపాధ్యాయ వేదిక (యూటీఎఫ్) చైర్మన్ వి.రాజశేఖరరెడ్డి, కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ పథకాల నగదు సాయంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు తరలి పోవడాన్ని ప్రభుత్వం గమనించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రమే ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. రాజకీయ లబ్ధికోసం ప్రైవేటు విద్యా సంస్థలకు కూడా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తే ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు మిగులు (సర్‌ప్లస్)గా అవుతారని, జీవో 117 ఉత్తర్వులను రద్దుచేసినా ఉపయోగం ఉండబోదన్నారు. మెగా డీఎస్సీ మాట ఎలా వున్నా ఇపుడున్న ఉపాధ్యాయులే ఖాళీ అయిపోతారన్న వాస్తవాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు.

చుక్.. చుక్ బండి ఇలాగైతే ఎలాగండి !



నేటి నుంచి 26 రైళ్లు రద్దు 5

కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి బాలుడి గల్లంతు

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్

నిధులు దారి మళ్లించిన అధికారులపై విచారణ జరపాలి

» ఉమ్మడి పశ్చిమ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు గోపాలరావు


గోపాలరావు

ఏలూరు రూరల్, జూన్ 23 : గ్రామ పంచాయతీ నిధులను దొంగిలించి, దారి మళ్లించిన అధికారులపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి బాధ్యులైన అధికారులను కఠినంగా శిక్షించాలని, రూ.8,629 కోట్లు తిరిగి పంచాయతీలకు జమ చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ కడలి గోపాలరావు ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు విన్నవించారు. నాలుగేళ్ళ నుంచి రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్రప్రభుత్వం 14,15వ ఆర్థిక సంఘాల ద్వారా, ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీలకు వేలకోట్లు నిధులు పంపితే ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్ళించింది. పంచాయతీలకు జమ చేయాలని చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు యలమంచలి బాబురాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘాల ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేశామని పేర్కొన్నారు. పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన 14,15 ఆర్థికసంఘాల నిధులను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దారి మళ్ళించిన రూ.8,629 కోట్లు, ఉపాధిహామీ పథకానికి చెందిన వేలకోట్లు పంచాయతీలకు విడుదల చేసేలా మంత్రి పవన్‌కల్యాణ్‌కు పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచ్ సంఘాల రాష్ట్రకమిటీ నాయకులు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

వంద భాషల్లో భగవద్గీత గజల్స్ రూపకల్పన


గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23 : భగవద్గీతను 'వంద భాషల్లో గజల్స్ రూపకల్పన' చేసేందుకు సంకల్పించినట్టు గజల్స్ వాయిద్యకారుడు గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం వద్ద శనివారం రాత్రి తెలుగు సాహితీ సమాఖ్య స్వర్ణోత్సవాల సందర్భంగా గజల్స్ విద్వాంసుడు గజల్ శ్రీనివాస్‌కు 'గజల్ సామ్రాట్ అవార్డు' ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షుడు మండా బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాస్, సినీగేయ రచయిత రసరాజు, బీవీఆర్ కళాకేంద్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో గ్రామాభివృద్ధి శూన్యం

వీరవాసరం (భీమవరంటౌన్), జూన్ 23 : గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే పులపర్తిరామాంజనేయులు అన్నారు. ఆదివారం వీరవాసరం మండలం పంజావేమవరం గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గం అంతా తిరిగి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దేశానికి గ్రామాలు పట్టుగొమ్మలని అందుకే అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. సమస్యలు ఏమైనా ఉంటే తనదృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తానని అన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), టీడీపీ ప్రధాన కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి చనమల్ల చంద్రశేఖర్, వీరవాసరం ఎంపీపీ దుర్గాభవాని, ఇతర ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత ఆయన కేక్ కట్‌చేసి అభినందనలు తెలిపారు. అనంతరం నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు.


గోస్తనీలో పేరుకు పోయిన కిక్కిస జీవీ కెనాల్‌లో గుర్రపు డెక్క, తూడు నిండిన దృశ్యం

పంట కాల్వలు చెత్తమయం

» తాగు, సాగునీటికి తప్పని ఇబ్బందులు
» గోస్తనీలో పేరుకుపోయిన కిక్కిస.. పట్టించుకోని అధికారులు

పెనుమంత్ర, జూన్ 23 : ఆచంట నియోజకవర్గంలో ప్రధాన పంట కాల్వలైన జీవీ కెనాల్, బ్యాంకు కెనాల్, నర్సాపూర్ కెనాల్ వాటి ఉప కాల్వల సమీపంలో నివాసాలు అధికంగా ఉండడంతో చెత్తాచెదారం ఆయా కాల్వల్లో పారేస్తున్నారు. ఈ మేరకు పంట పొలాలకు నీటి ప్రవాహం అవరోధం ఏర్పడడంతో అన్నదాతలకు కన్నీరు తెప్పిస్తున్నాయి. జీవీ కెనాల్‌లో మాముడూరు బ్రిడ్జి వద్ద నుంచి వచ్చిన వ్యర్థాలు, తూడు పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు కదలడం లేదు. బ్యాంకు కెనాల్, నరసాపురం కెనాల్ ప్రాంతాల్లో ఇళ్లు, పశువుల పాకలు గట్లపై వెలిశాయి. ఈ మేరకు చెత్తాచెదారం కాల్వలోనే వేయడం, మృతి చెందిన కళేబరాలు, కోళ్ల వ్యర్థాలు, నీటి వాడకాలు, మరుగుదొడ్ల తూరలు కాల్వల్లోకి పెట్టడంతో దిగువ ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే కాల్వలు నీటి కాలుష్యానికి గురవుతున్నాయి.

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కాల్వల కలుషితంపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ అధికారులు కాల్వల్లో తూడు తొలగింపు పనులు చేపట్టకపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. గత ఐదేళ్లగా ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో కాల్వ గట్లు పునరుద్ధరణ, ఉప కాల్వలకు వెళ్లే గేట్లు మరమ్మతులు వంటివి గాలికి వదిలేశారు.

బినామీ కాంట్రాక్టర్ల చేతివాటం !

గోస్తనీ నది తవ్వకాలలో బినామీ కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శించినట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వ పాలనలో పెనుమంత్ర మండలం పెనుమంత్ర నుంచి సోమరాజు ఇల్లింద్రపర్రువరకు మూడు ప్యాకేజీల్లో గోస్తనీ నది తవ్వకాలు రూ. 4.20 లక్షలతో చేపట్టారు. తవ్వకాలు చేపట్టాల్సిన కాంట్రాక్టర్లను వైసీపీ నేతలు బెదిరించి అప్పటి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అండదండలతో ఆయన అనుచరులే బినామీ కాంట్రాక్టర్లుగా అవతారమిచ్చారు. నిబంధనలు గాలికి వదిలేసి గోస్తనీ నదిలో పేరుకుపోయిన కిక్కిస, బురదను గట్లపైకి వేసి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి జేబులు నింపుకున్నారు. పనులు పర్యవేక్షించాల్సిన డ్రెయినేజీ అధికారులు పత్తాలేకుండా పోయారు.

ప్రజలకు ప్రధాన రవాణా సాధనాలు రైళ్లు. అయితే సుమారు రెండేళ్లుగా రైళ్లు ఎక్కాలంటే జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రయాణంలో నరకం చూస్తున్నారు. ఎందుకంటే ఏ రైలు ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో రాదో.. ఒకవేళ అదృష్టం బాగుండి వచ్చినా గమ్యానికి ఎప్పుడు చేరుస్తుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. నిర్వహణ పేరుతో దారి మళ్లించడం, తాత్కాలి కంగా రద్దు చేస్తుండడంతో రైలు ప్రయాణం అయోమయంగా మారింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు రాజమండ్రి రైల్వే స్టేషను మీదుగా నడుస్తూ.. ప్రజాదరణ ఎక్కువగా కలిగిన 26 రైళ్లను ఏకంగా నెలన్నరపాటు రద్దు చేయడంతో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, సీజనర్లు ఇబ్బందులు తప్పడం లేదు. ఏదేమైనా రైళ్లు గాడి తప్పడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

చుక్ చుక్ బండి.. ఇలాగైతే ఎలాగండి !



నేటి నుంచి 26 రైళ్లు రద్దు

» ఇప్పటికే ఉసూరుమంటున్న ప్రయాణికులు
» నిర్వహణ పేరుతో నెలన్నర బంద్
» సుదూరాల నుంచి వచ్చే రైళ్లే దిక్కు
» ఆ రైళ్లలో కాలు పెట్టలేని దుస్థితి
» ఇంటర్ సిటీలు వేయాలని డిమాండ్
» కొత్త ఎంపీలు పట్టించుకోవాలని అభ్యర్థన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/ ఏలూరుఎడ్యుకేషన్ :

రైళ్ల రద్దుతో తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్, ఉమ్మడి పశ్చిమ జిల్లా ప్రయాణికులకు అగచాట్లే.. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు రాకపోకలు సాగించే వాళ్లకు మరిన్ని తిప్పలు తప్పకపోవచ్చు. సింహాద్రి రైలును తాత్కాలికంగా రద్దు చేస్తేనే జనాలు అల్లాడిపోతారు. అలాంటి పరిస్థితుల్లో రత్నాచల్, సర్కారు, జన్మభూమి, లింక్, తిరుపతి-కాకినాడ బళ్లను ఆపేయడం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తారస్థాయికి చేరే అవకాశం ఉంది. కారణాలేమైనా ప్రత్యామ్నాయంగా ఇంటర్ సిటీలు నడపాలనే డిమాండ్ వినవస్తోంది. తమ అవస్థలపై కొత్తగా ఎన్నుకున్న ఎంపీ పురందేశ్వరి దృష్టి సారించాలని గోదారోళ్లు కోరుతున్నారు.

చుక్‌చుక్ బండి ఎందుకిలా..

రైల్వే చరిత్రలోనే 2023 జూన్ 2వ తేదీ దారుణమైన దుర్ఘటన. ఒడిశాలోని బాలాసోర్ వద్ద కోరమాండల్ మరో రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 300 మందికిపైగా బలైపోయారు.దీంతో రైల్వే ఉలిక్కిపడింది. అత్యున్నత స్థాయిలో సమావేశాలు జరిగాయి. భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని.. ట్రాక్, సిగ్నల్స్ వంటి కీలకమైన విభాగాలకు నిర్వహణకు తగు సమయం కేటాయించాలని నిర్ణయించారు. ఆ మేరకు పనులు ఆరంభించారు. వీటి కోసం రోలింగ్ బ్లాక్ కారిడార్ పేరుతో రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం, దారి మళ్లించడం చేస్తున్నారు. నాటి నుంచి మెయింటెనెన్స్ అని ట్రాక్‌పై రైళ్లను రద్దు చేస్తున్నారు.. కానీ పనులు వేగంగా చేయడం లేదనే విమర్శలున్నాయి. దీంతో రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

రద్దు చేసిన రైళ్లు ఇవే..

రైళ్లను రానుపోను తాత్కాలికంగా ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 26 నిలిపివేశారు రైలు నెం. 07466, 07467 (రాజమండ్రి-విశాఖ మెము), 17257, 17258 (కాకినాడ-విజయవాడ మెము), 17219, 17220 (మచిలీపట్నం-విశాఖ), 17249, 17250 (తిరుపతి-కాకినాడ), 17239, 17240(సింహాద్రి), 17243, 17244 (రాయగడ), 12861, 12862(లింక్ దక్షిణ్), 12717, 12718(రత్నాచల్), 12805, 12806 (జన్మభూమి), 17643, 17644 (సర్కారు), 22701, 22702(ఉదయ్), 12775, 12776 (కోకనాడ), 22707, 22708 (విశాఖ-తిరుపతి డబుల్ డెకర్) రైళ్లు 47 రోజుల పాటు రాకపోకలు సాగించవు. ఈ మేరకు ఫిబ్రవరి 19వ తేదీనే ఆదేశాలు జారీ అయ్యాయి. బీసీఐ, టీఎస్‌టీఆర్, పీక్యూఆర్ఎస్ పనుల కోసం రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయం కోసం ఎంపీలను కలవనున్న 'ట్రైన్ మేట్స్'

ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా, కొండ నాలుకకు మందు వేయడానికి ఉన్న నాలుకను తీసివేసిన చందంగా రైల్వే అధికారుల తీరు ఉందని ప్రయాణికులు, సీజనర్లు మండిపడుతున్నారు. ఆధునికీకరణ-సాంకేతికతల జపంతో సామాన్యుల వాహనాలైన రైలుబళ్ళను రద్దుచేయడం సరైన విధానం కాదని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దీనిలో భాగంగా ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పార్లమెంటు సభ్యులు, విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్ఎంలను కలుసుకుని, రద్దుచేసిన రైళ్లస్థానే విజయవాడ-రాజమండ్రి మధ్య నిత్యం ప్రయాణించే అన్నిశాఖల ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, డైలీ సీజనర్లు, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలోపెట్టుకుని ప్రత్యామ్నాయ రైలు ఒకటి నడపాలని వినతిపత్రాలను అందజేసి అభ్యర్థించాలని నిర్ణయించారు. ఆ మేరకు విజయవాడ, నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరంలకు రోజూ ఉదయం, సాయంత్రం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో రాకపోకలు సాగించేవారంతా 'ట్రైన్ మేట్స్'గా ఏర్పడి ఒక ఫార్మేట్‌లో సంతకాలు సేకరించి ఎంపీలు, రైల్వే ఉన్నతాధికారులకు ఇవ్వడానికి కార్యాచరణ చేపట్టారు. ప్రత్యామ్నాయాల్లో భాగంగా తెల్లవారుఝామున 3.15 గంటలకు బయలుదేరే 07768 విజయవాడ-రాజమండ్రి మెమూ ఎక్స్‌ప్రెస్‌ను ఉదయం ఐదు గంటలకు విజయవాడలో బయలుదేరే సమయంగా నిర్ణయించడంతోపాటు, విజయవాడ-విశాఖ రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఈ రూట్‌లో రాజమండ్రి వరకు మరో రైలుని నడిపాలని కోరుతున్నారు. ఈ ప్రత్యామ్నాయ చర్యలతోపాటు దూర ప్రాంతాలనుంచి వచ్చే కొన్ని రైళ్లకైనా సాధారణ ప్రయాణికుల కోసం జనరల్ భోగీల సంఖ్యను పెంచాలని అభ్యర్థిస్తున్నారు. రైళ్ళ రద్దు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పార్లమెంట్ సభ్యులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని 'ట్రైన్ మేట్స్' నాయకులు ఎండీ. జుల్ఫీకర్ అలీ, హలీమ్ కోరారు.

భక్తజనులతో శ్రీవారి క్షేత్రం కళకళ

ద్వారకాతిరుమల, జూన్ 23 : శ్రీవారి ఆలయం ఆదివారం భక్తజనులతో కళకళలాడింది. చిరుజల్లులు కురుస్తున్నా భక్తులు ఆలయానికి వచ్చి శ్రీవారిని అమ్మవార్లను దర్శించుకున్నారు. సెలవురోజు కావడం వల్ల ఆలయానికి దాదాపు 15 వేలమంది పైబడి యాత్రికులు వచ్చినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. వీరంతా ముందుగా ఆలయంలో మొక్కుబడులు తీర్చుకుని, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం శ్రీవారి వకుళమాత అన్నదాన భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మోకాళ్లతో శ్రీవారి మెట్లెక్కిన టీడీపీ అభిమాని..

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అంటే విపరీతమైన అభిమానం. అఖండ మెజారిటీతో కూటమి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని... తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఎమ్మెల్యే కావాలని ఆపద మొక్కుల వాడికి మొక్కుకున్నాడు. అంతా అనుకున్నట్టు జరగడంతో ఆదివారం ఆ టీడీపీ వీరాభిమాని పసుపులేటి జైబాబు తన కుటుంబ సభ్యులతో శ్రీవారి క్షేత్రానికి వచ్చి తలనీలాలను స్వామికి సమర్పించాడు. అనంతరం ఒక చేతిలో ఆరిమిల్లి ఫొటో, మరో చేతిలో పార్టీ గుర్తును పట్టుకుని ఆలయ మెట్లను మోకాళ్లతో ఎక్కి ఆలయంలోకి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు జరుపుకున్నారు.


శ్రీవారి దర్శనార్థం క్యూలైన్‌లోలో వెళ్తున్న భక్తులు


మోకాళ్లతో ఆలయ మెట్లు ఎక్కుతున్న టీడీపీ అభిమాని జైబాబు


తయారు చేసిన శివలింగాలను చూపుతున్న మహిళలు

శ్రీశైలం మల్లికార్జునస్వామి అభిషేకానికి..

» మట్టి శివలింగాల తయారీలో పాలకొల్లు మహిళలు

పాలకొల్లు అర్బన్, జూన్ 23 :స్థానిక పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మట్టితో పార్థివ శివలింగాలను మహిళలు తయారు చేస్తున్నారు. రానున్న కార్తీక మాసంలో శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామికి కోటి శివలింగాలతో అభిషేకం చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన ఓ భక్తుడు మొక్కుకున్నాడని, దానిలో భాగంతో తమ వంతుగా శివలింగాలను తయారు చేస్తున్నామని మహిళలు తెలిపారు. సుమారుగా 70 ముద్రలను అందించారని వాటితో తాము ప్రతీ రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్వామివారి సన్నిధిలో సుమారు 40 మంది పాల్గొంటున్నామన్నారు. ఇప్పటి వరకు సుమారుగా 25 వేల శివలింగాలను తయారు చేశామన్నారు. పాలకొల్లు నుంచి సుమారు లక్ష శివలింగాలు తయారు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ లింగాలను శ్రీశైలం ఆలయంలో అభిషేకాలు చేసిన అనంతరం నిమజ్జనం చేస్తారని తమతో పాటుగా 24వ వార్డులోని శంభేశ్వర స్వామి ఆలయంలోనూ మహిళలు శివలింగాలను తయారు చేస్తున్నట్టు తెలిపారు. తయారైన శివలింగాలను చిన్న చిన్న అట్టపెట్టెల్లో భద్రపరుస్తున్నట్టు తెలిపారు.

వచ్చే నెల 7 నుంచి జగన్నాథుని రథోత్సవాలు


పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్రా బలభద్ర జగన్నాథ విగ్రహాలు

ద్వారకాతిరుమల, జూన్ 23: శతాబ్దకాలం నాటి పురాతన చరిత్ర కలిగిన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జూలై 7 నుంచి 17 వరకు జగన్నాథుని రథోత్సవాలు జరగనున్నట్లు ఆలయ ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను పూరీ క్షేత్రంలో మాదిరిగా ఇక్కడ శ్రీవారి దేవస్థానం వైభవంగా నిర్వహిస్తుంది. ఈ క్రమంలో పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, జగన్నాథదారు విగ్రహాలు ఉత్సవక్రతువులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా వచ్చే నెల ఏడో తేదీన రథవాహనంపై స్వామివారు లక్ష్మీపురం ఆలయం నుంచి సాయంత్రం ఐదు గంటలకు శ్రీవారి క్షేత్రానికి ఊరేగింపుగా వస్తారు. ఉత్సవాల ముగింపు రోజైన 17న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి సాయంత్రం ఐదు గంటలకు రథయాత్రగా వెళ్లనున్నారు. ఈ ఉత్సవాలను దర్శించి భక్తులు తరించాలని ఈవో కోరారు.

సీటీజీఈవోఏ కార్యవర్గం ఎన్నిక



విజయవాడ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ పరిధిలో ఐదు జిల్లాల పరిధిలో సెంట్రల్ టాక్స్ గెజిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉండే ఈ కార్యవర్గం అధ్యక్షుడిగా బి.నవీన్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా కె.యుగంధర్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్ ఈశ్వరరావు, బి.సుకుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీకాంత్, సీహెచ్ కన్నారావు ఎన్నికవ్వగా, కోశాధికారిగా మిక్కిలినేని శ్రీనివాస్, లైజనింగ్ కార్యదర్శిగా టీవీజీకే మూర్తి, జేసీఎం సభ్యురాలిగా బి.శ్రీలక్ష్మి మెంటార్‌గా ఎం.నాగరాజు ఎన్నికయ్యారు.


మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే పితానిని కలసిన డాక్టర్ శ్రీనివాస్

మంత్రి నిమ్మలను కలసిన మార్టేరు ఏడీఆర్ శ్రీనివాస్

పాలకొల్లు రూరల్/పెనుమంత్ర జూన్ 23 :మార్టేరు వరి పరిశోధాన స్థానం విశిష్టతను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు వరి పరిశోధాన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు, ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వరిపరిశోధాన స్థానం విశిష్ట తను తెలిపి, ఒకసారి సందర్శించాలని కోరారు. ఈ సందర్భంగా 2022లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విడుదలైన వరి వంగడాలు రైతులకు ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. స్వర్ణ రకంగా పేరొందిన ఎంటీయూ 1318 విత్తనాలను ప్రదర్శించి వాటి గుణగణాలను మంత్రికి తెలిపారు.

పితానిని కలసిన మార్టేరు ఏడీఆర్

ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను మార్టేరు వ్యవసాయ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్ ఆదివారం పోడూరు మండలం కొమ్ము చిక్కాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణకు ఎంటీయూ 1318 వరి రకంపై వివరించారు. కాలపరిమితిలో చీడపీడల తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చిన స్వర్ణ రకం అని తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 23 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు జిల్లాలో ఉన్న పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, లాడ్జీలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించారు. ప్రార్థనాలయాలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తుగా రాత్రిపూట ఆ ప్రాంతాలను తనిఖీలు చేశారు. గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం రవాణా జరుగకుండా జాతీయ, రాష్ట్రీయ రహదారులపై విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు.

హెడ్ కానిస్టేబుల్ వ్యాఖ్యలపై విచారణ..?

భీమవరం క్రైం, జూన్ 23 : భీమవరం పట్టణంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కొన్ని సామాజిక వర్గాలపై వ్యాఖ్యలు చేస్తూ వీడియో విడుదల చేశారు. అవి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టినట్టు సమాచారం.

కైకరంలో ఉద్రిక్తత

ఉంగుటూరు, జూన్ 23 : ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ నాయకుడు పుప్పాల గోపి ఇంటి వద్ద తాను లేని సమయంలో తన ఇంటికి పలువురు వచ్చి సీసీ కేమేరాలు, కారు అద్దాలు పగలగొట్టారని వాపోయారు. అదేవిధంగా ఆర్యవైశ్య నాయకుడు కోనా శ్రీనివాసరావు ఇంటికి కొందరు గుంపుగా వెళ్లి దౌర్జన్యం చేయడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది. పలువురు యువకులు మద్యం తాగి దాడులు చేసినట్టు చెబుతున్నారు. చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ పరిస్థితులను అంచనా వేసి ఎటువంటి గొడవలు లేకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల ఫ్లెక్సీ వివాదమే దీనికి కారణమని పలువురు భావిస్తున్నారు.

క్రైం సమాచారం


ఏలూరు కాల్వలో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) మణికంఠ (ఫైల్)

కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి బాలుడి గల్లంతు

» గాలింపు చర్యలు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23 : కాళ్లు కడుక్కునేందుకు వెళ్లిన బాలుడు కాలు జారి ఏలూరు కాల్వలో గల్లంతైన ఘటన ఆదివారం తాడేపల్లిగూడెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. పడాలకు చెందిన వానపల్లి మణికంఠ తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సైకిల్‌కు ప్యాచ్ పడడంతో వేయించేందుకు యాగర్లపల్లి వంతెన సమీపంలో సైకిల్ ఇచ్చి కాళ్లకు మట్టి అయిందని కాళ్లు కడుక్కునేందుకు కాల్వలోకి దిగి ప్రమాదవశాత్తు జారిపోయాడు. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాల్వలో వడి ఎక్కువ ఉండడంతో చాలా సేపు ప్రయత్నించి నిలుపుదల చేశారు. ఈ మేరకు కేసు చేమోదు చేశామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మణికంఠ తండ్రి సూరిబాబుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు గల్లంతు కావడంతో ఆ కాల్వ గట్టునే కన్నీటిపర్యంతమయ్యాడు.

ఆలయానికి వెళితే.. ఇల్లు దోచేశారు

» 11 కాసుల బంగారం, నగదు తస్కరణ

జంగారెడ్డిగూడెం, జూన్ 23 : పట్టణంలోని సూరపురాజు కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు విలువైన వస్తువులు దొంగిలించిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపిన వివరాలివి.. స్థానిక సూరపురాజు కాలనీకి చెందిన బోగిరెడ్డి చంద్రయ్య తన కుటుంబంతో కలసి అహోబిలం ఆలయానికి ఈనెల 21న వెళ్లారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడంతో పక్క పోర్షన్‌లో అద్దెకు ఉండే వారు చంద్రయ్యకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. సత్వరమే 22వ తేదీ రాత్రి ఇంటికి చేరుకుని చూడగా బీరువా పగులగొట్టి అందులోని 11 కాసుల బంగారు వస్తువులు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్

» రూ.3.56 లక్షల విలువైన బంగారు ఆభరణాలు రికవరీ


చోరీ వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న మహిళను రైల్వే పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ జి. శ్రీహరిబాబు తెలిపారు. ఆదివారం తాడేపల్లిగూడెంలో ఎస్ఐ చోరీ వివరాలు వెల్లడించారు. రైళ్లలో చోరీలు జరుగుతున్నాయని రైల్వే పోలీసులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టగా తాడేపల్లిగూడెం నుంచి నిడదవోలు వెళ్లే రూట్‌లో చోరీలకు పాల్పడుతున్న నరసాపురం పట్టణానికి చెందిన యామన నందినిదేవిని అదుపులోకి తీసుకున్నామన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లలో నమోదైన రూ.3.56 లక్షల విలువ చేసే 113 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ సొత్తును రికవరీ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఇంటిముందు పార్క్ చేసిన బైక్ చోరీ

ఏలూరు క్రైం, జూన్ 23 : రాత్రివేళ ఇంటి ముందు పార్కు చేసిన కేటీఎం బైక్‌ను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ తన కేటీఎం బైక్‌ను తన ఇంటి ముందు ఉంచి తాళాలు వేశారు. తెల్లవారేసరికి ఆ బైక్ కనిపించలేదు. ఈమేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దుర్భాషలాడిన వైసీపీ నాయకులపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 23 :జనసేన నాయకులు, కార్యకర్తలను పరుష పదజాలంతో దుర్భాషలాడారని వైసీపీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని లక్కవరం ఎస్ఐ సుధీర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం లక్కవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. పుట్లగట్లగూడెంలో ఈనెల 19న వైసీపీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తన తల్లి పేరుతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌పై ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను జనసేన నాయకులు కావాలని చింపేశారని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలను దుర్భాషలాడి దూషించారని జనసేన నాయకుడు కాటిచర్ల మణికంఠస్వామి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వామిశెట్టి హరిబాబు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

చిన్నారి వైద్యానికి మంత్రి భరోసా



మంత్రి రామానాయుడును కలిసిన చిన్నారి తల్లిదండ్రులు

పాలకొల్లు టౌన్, జూన్ 23: కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న పాలకొల్లు 18వ వార్డుకు చెందిన 13నెలల చిన్నారి అక్షరను వెంటబెట్టుకుని ఆమె తల్లిదండ్రులు ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయానికి తీసుకొచ్చారు. వైద్యానికి రూ.1లక్షా 50వేలు ఖర్చు అవుతుందని, వైద్యానికి అయ్యే ఖర్చును భరించలేక ఇబ్బంది పడుతున్నామంటూ తల్లిదండ్రులు మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి రామానాయుడు వెంటనే సీఎం కార్యాలయానికి ఫోన్ చేసి మాట్లాడారు. చిన్నారి పరిస్థితిని వివరించి 10రోజుల్లో శస్త్ర చికిత్స చేయాల్సి ఉన్నందున అప్పటిలోగా సహాయం అందేలా చూడాలని కోరారు. అనంతరం మంత్రి నిమ్మల చిన్నారి తల్లిదండ్రులతో అధైర్యపడొద్దని, వైద్యం చేయిస్తామని భరోసా ఇచ్చారు.

మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడదాం



మొక్కలు నాటుతున్న బీజేపీ కన్వీనర్ సతీష్, నాయకులు

నరసాపురం రూరల్, జూన్ 23: పర్యావరణ పరిరక్షణకు ఖాళీ స్థలాలతో పాటు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెంచి వాటిని పరిరక్షిద్దామని బీజేపీ కన్వీనర్ మేకల సతీష్ పిలుపునిచ్చారు. ఆదివారం లిఖిత పూడిలో బీజేపీ నాయకులు శ్యాంప్రసాద్‌ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీని గ్రామ, వార్డుల స్థాయిల్లో బలోపేతం చేద్దామన్నారు. కూటమి పార్టీలతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాను చాటుదామన్నారు. పార్టీ కేడర్ అంతా కష్టించి పని చేయాలని పిలుపునిచ్చారు. పండు, దిలీప్, ఈశ్వర్, నాగభాస్కర్, వనమాల శ్రీను, సిహెచ్ వెంకటేశ్వరావు, కె నాగేశ్వరరావు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

భీమవరం మానవత కార్యవర్గం



భీమవరం అర్బన్, జూన్ 23: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం మండల శాఖ వార్షిక కార్యవర్గ సమావేశం గాంధీ కస్తూరీబా సేవా సంఘ భవనంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మానవతా విస్తరణ కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు విచ్చేశారు. గత సంవత్సర కాలంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 25సంవత్సరాలుగా విద్య వైద్య ఉపాధి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కారుమూరి నరసింహమూర్తి, ఇందుకూరి ప్రసాదరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, చేకూరి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

భీమవరం టౌన్, జూన్ 23 : భీమవరం ప్రకాశం చౌక్‌లో ప్రకాశం పంతులు విగ్రహాన్ని నెలకొల్పడానికి అనుమతులు కోరుతూ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు వినతి పత్రాన్ని అందించారు. ప్రకాశం పంతులు విగ్రహ నిర్మాణ కమిటీ కార్యదర్శి చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో ప్రకాశం పంతులు భీమవరం గ్రామానికి వచ్చినప్పుడు ఆయనతో జెండా ఎగుర వేసిన ప్రాంతంలో ప్రకాశం చౌక్ అని నామకరణం చేశారని, ఇప్పటి వరకు విగ్రహం లేని ప్రకాశం చౌక్ ఉందని, 15 ఏళ్లుగా ప్రజా ప్రతినిధులకు ఈ విషయంపై చర్చిస్తూ వస్తున్నామని, ఈ సారి ఎమ్మెల్యే అంజిబాబు తప్పక విగ్రహ ఆవిష్కరణకు స్థలం అనుమతి మంజూరు చేస్తారని భావిస్తున్నామని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి అనుమతి ఇచ్చేలా చూస్తానన్నారు. విగ్రహ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నందమూరి రాజేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణ, ఉండపల్లి రమేష్ నాయుడు, నరహరిశెట్టి కృష్ణ, ఎద్దు ఏసుపాదం, ఇందుకూరి శివాజీ వర్మ పాల్గొన్నారు.

మానవత పెంటపాడు కార్యవర్గం



పెంటపాడు, జూన్ 23: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని ఎంఈవో టీవీ రామకృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మానవత మండల నూతన కార్యవర్గాన్ని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీసాల సత్యనారాయణ, కార్యదర్శి గా సత్తారు రాము, కోశాధికారిగా ఏలూరి వీరాస్వామి, ఉపాధ్యక్షుడిగా నక్కా సాంబశివరావు, సంయుక్త కార్యదర్శిగా విప్పర్తి వినాయకుడు, కర్రి గిరీష్‌రెడ్డి, పీబీ శ్రీనివాసాచార్యులు, సింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమిల్లి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. వీరితో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు

నిజాయితీనే నా సర్వేల విజయ రహస్యం



ముఖాముఖిలో మాట్లాడుతున్న కిరణ్ కొండేటి

భీమవరం టౌన్, జూన్ 23 : సర్వే చేసేటప్పుడు ఎన్నో కష్టాలు, బాధలు పడ్డానని, నా భార్య ఏడుపు, అప్పుల వాళ్ళ తలుపు చప్పుళ్ళతో గడిపిన రోజులు కూడా ఉన్నాయని, ఆ స్థాయి నుంచి నేడు ఎంతో ఉన్నతస్థాయికి వచ్చానని కేకే సర్వే సంస్థ సీఈవో కిరణ్ కొండేటి అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ముఖాముఖి కార్యక్ర మాన్ని నిర్వహించారు. నా నిజాయితీనే నా సర్వేల విజయ రహస్యమని, ఏడు ఏళ్ళ నుంచి సర్వేలు చేయడం మొదలు పెట్టానని, మా టీమ్‌తో చేసిన ఏ సర్వే తప్పు కాలేదన్నారు. ఎంతో మంది ఎన్నో డబ్బుల ఆఫర్స్, ఎన్నో బెదిరింపులు కూడా వచ్చాయని, మాలో ఉన్న శక్తి మమల్ని నడిపిస్తుందన్నారు. కంచుకోటలు అనేవి శాశ్వతం కాదని అన్నారు. ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. అనకాపల్లి అయిన అమెరికా అయిన జనం తెలివైన వాళ్ళేనని, వాళ్ళు ఎవరికి వెయ్యాలి అనుకుంటేనే వాళ్ళకే ఓటు వేస్తారని, అన్ని పథకాలు అంతకన్నా ఏమి ఇచ్చిన ప్రజలు తీసుకుంటారని అన్నారు. ఏ పార్టీతోను కలవనని, టీడీపీ సూపర్ 6 అనే పథకాలు లేకపోయినా 150 సీట్లు వచ్చేవని అన్నారు. అనంతరం కేకేను సత్కరించారు. మావుళ్ళమ్మ అమ్మవారిని కేకే సర్వే సంస్థ సీఈవో కిరణ్ కొండేటీ దర్శించుకున్నారు.

గణేశ్ దంపతులకు సన్మానం



పాలకొల్లు టౌన్, జూన్ 23: శ్రీశైలంలోని ఉమారామలింగేశ్వరస్వామి దేవాంగ సత్రం బోర్డు సభ్యుడుగా పాలకొల్లుకు చెందిన జిల్లా దేవాంగ సంఘం చైర్మన్ వట్టం గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో పాలకొల్లు వీవర్స్ కాలనీలోని దేవాంగ కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు ఆదివారం గణేష్ కిరణ్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మానెం బసవరాజు, ఊటుకూరి బోగేశ్వరరావు, బాసిన సత్యనారాయణ, కుర్మా శివగణేష్, నక్కిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

అత్తిలి మానవత అధ్యక్షుడిగా బాలకృష్ణరాజు

అత్తిలి, జూన్ 23 : మానవత సేవా సంస్థ అత్తిలి మండల అధ్యక్షుడిగా బాలకృష్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అత్తిలిలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సమావేశంలో ఛైర్మన్ అనాల ఆదినారాయణ, కార్యదర్శి కొరిపల్లి హరి, కో ఛైర్మన్ తోట వెంకట సుబ్బారావు, కాశిగాని హనుమంతరావు, ఆల్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

గొప్ప దేశభక్తుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు



భీమవరంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జూన్ 23 : బీజేపీ మాతృ సంస్థ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 123 వ వర్ధంతిని నరసాపురం పార్లమెంట్ జిల్లా కార్యాయలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ మాట్లాడుతూ దేశ విభజనకు వ్యతిరేకంగాను, జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ జమ్ముకాశ్మీర్‌లో ఉద్యమం చేసి అరెస్టు అయి పోలీసుల అదుపులో అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయిన గొప్ప దేశభక్తుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్నారు. అటువంటి మహనీయులను నేడు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసిన నివాళులు అర్పించారు.

కాళ్ల(ఉండి): శ్యాంప్రసాదు ముఖర్జీ గొప్ప మానవతావాది, విద్యావేత్త అని ఉండి నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనరు కోరా రామ్మూర్తి అన్నారు. ఆదివారం కాళ్ల మండలంలోని పలు గ్రామాలలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించినట్లు రామ్మూర్తి తెలిపారు. శ్యాంప్రసాదు ముఖర్జీ చిన్న వయస్సులోనే కోల్‌కతా విశ్వవిద్యాలయానికి కులపతిగా నియమితులై గుర్తింపు పొందారన్నారు.

ఉండి: ఎన్ఆర్‌పిఅగ్రహారంలో శ్యాంప్రసాదు ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రామ బీజేపీ అధ్యక్షుడు నాగ పృథ్వీ మాట్లాడుతూ కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తి ముఖర్జీ అన్నారు. కార్యక్రమంలో వి.సాయి. నాగరాజు పాల్గొన్నారు.

పెనుగొండ: దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పేరు పొందారని పెనుగొండ మండల బీజేపీ అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ పేర్కొన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం పెనుగొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆచంట: ఆచంటలో బీజేపీ నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముచ్చర్ల నాగ సుబ్బారావు, అందే బసవ గణపతి, రామిశెట్టి రామచంద్రరావు, వేండ్ర సిద్దయ్య, నేలపూడి ఏసురత్నం, చదలవాడ శేఖర్‌బాబు, దిర్శిపో శ్యాంబాబు పాల్గొన్నారు.

తణుకు: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీని ప్రతి బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నాయకురాలు ముళ్ళపూడి రేణుక అన్నారు. ఆదివారం తన నివాసం వద్ద ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఒక దేశానికి రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు ఉండకూడదని దేశవ్యాప్తంగా ఉద్యమం లేవదీశారని చెప్పారు. బీజేపీ నాయకులు పెదమల్లు అవినాష్, పోలిశెట్టి బాలాజీ, కిరణ్మయి, గంటా లక్ష్మీ, ముప్పిడి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆకివీడు: కాశ్మీర్ సమస్యపై నిరంతరం పోరాడిన వ్యక్తి జనసంఘ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ మండలాధ్యక్షుడు కట్రెడ్డి ఏడుకొండలు అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాని కి చెరుకుమిల్లి, కుప్పనపూడి, దుంపగడప, సిద్ధాపురం, గుమ్ములూరు గ్రామాల్లో ఆ దివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వచ్చేనెలలో ధాన్యం బకాయిల చెల్లింపు: ఎమ్మెల్యే పితాని



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

పోడూరు/పెనుమంట్ర, జూన్ 23 : గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు డబ్బు చెల్లించేందుకు రూ.3200 కోట్ల రుణాలు తీసుకుని వేరే ఖాతాలకు మళ్లించిందని దీంతో రైతాంగానికి రెండు నెలలు కావస్తున్నా ధాన్యం సొమ్ము జమ కాలేని పరిస్థితి ఏర్పడిందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం పోడూరు మండలం కొమ్ము చిక్కాల స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఉన్న మాట వాస్తవం అని అన్నారు. జూలై మొదటి వారం నుంచి దఫ దఫాలుగా రైతుల ఖాతాలో ధాన్యం బకాయి సొమ్మును జమ చేయడం జరుగుతుందని అన్నారు.

నారుమళ్లు వేసేందుకు సిద్ధంకండి

జిల్లాలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి ఇటీవల పోలవరం వచ్చిన సీఎంతో చర్చించామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. గోదావరిలో నీటి లభ్యత తక్కువ ఉన్న కారణంగా నీటి ఎద్దడి ఉత్పన్నమైందని దానిని నివారించేందుకు గోదావరి ఎడమ కాల్వ నుంచి నీటి ప్రవాహాన్ని తగ్గించి గోదావరి కుడికాలువకు నీటి లభ్యత పెంచి నరసాపురం బ్యాంక్ కెనాల్‌కు నీటి లభ్యత పెంచుతామని అధికారులు చెప్పినట్లు వెల్లడించారు దీంతో రైతాంగం నారుమళ్ళకు సిద్ధం కావాలని అన్నారు.



ఎమ్మెల్యే బొమ్మిడికి వినతిపత్రం అందిస్తున్న కలవకొలను తాతాజీ

ధాన్యం సొమ్ము ఇప్పించండి

నరసాపురం రూరల్, జూన్ 23: ధాన్యం సొమ్ము ఇప్పించాలంటూ ఆదివారం రైతులు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను కలిసి తమ గోడును విన్నవించారు. సీతారాంపురం సొసైటీ మాజీ అధ్యక్షుడు నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన రైతులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. దాళ్వాలో ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాం, ఇంకా సొమ్ము జమ కాలేదు, ఎన్నికల ముందు నుంచి ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేశారు. మూడు నెలలు గడిచింది. ఇంత వరకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. వచ్చే పంటకు పెట్టుబడులు పెడదామంటే చేతిలో చిల్లిగవ్వలేదు, ఎరువులు, మందులు ఇచ్చిన వ్యాపారులు డబ్బులకు నిలదీస్తున్నారు. మా సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే దీనిపై అధికారులతో చర్చించి సొమ్ము చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాజీనామా చేసిన వలంటీర్లను తీసుకోవద్దు



టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజుకు వినతి పత్రం అందిస్తున్న మైనార్టీ సెల్ నాయకులు

ఆకివీడు, జూన్ 23: ప్రభుత్వ సొమ్మును జీతాలుగా తీసుకొని వైసీపీ కార్యకర్తల్లా పనిచేసి రాజీనామా చేసిన వలంటీర్లను మరలా విధుల్లోకి తీసుకోవద్దని రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండి రియాజుద్దీన్ అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజును ఆదివారం మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అబ్జల్, ఆరీఫ్‌లతో కలిసి వినతి పత్రం అందచేసి మాట్లాడారు. వలంటీర్లను చంద్రబాబు నాయుడు రాజీనామా చేయొద్దని, జీతం రూ.10 వేలు చేస్తామని చెప్పినా వినలేదన్నారు. మరలా వైసీపీదే ప్రభుత్వమని, జగనన్న గెలుపుకు తాము కృషి చేయాలని ప్రగల్భాలు పలికిన వలంటీర్లు నేడు తమను మరలా తీసుకోవాలని జగన్‌కు మించి నటిస్తున్నారన్నారు. జగన్‌కు పాలభిషేకాలు చేయడమే కాకుండా ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురిచేశారన్నారు.

శ్రీవారికి ఎమ్మెల్యే బొలిశెట్టి పూజలు



ద్వారకాతిరుమల, జూన్ 23: ద్వారకా తిరుమలేశుని ఆలయాన్ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని పలికారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.

గ్రామాలకు స్వర్ణయుగం : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23: వైసీపీ ప్రభుత్వంలో నిరాదరణకు గురైన గ్రామాలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో స్వర్ణయుగం రానుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జగన్నాథపురంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హజరత్ కాలే మస్తాషా వలి దర్గా వద్ద దర్గా పోషకులు అబ్బిన నాగమణి ఎమ్మెల్యేను సత్కరించారు. జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్, నాయకులు గెడ్డం సాల్మన్‌రాజు, పుల్లా అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

మందుల వర్తక సంఘ సభ్యులు సేవ చేయాలి



సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాజును సన్మానిస్తున్న సభ్యులు

గణపవరం, జూన్ 23: సమాజ సేవలో కూడా మందుల వర్తక సంఘం సభ్యులంతా పని చేయాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం గణపవరం మండల మందుల వర్తక సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక చాణుక్య జూనియర్ కళాశాలలో జరిగింది. మందుల వర్తక సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఈనెల 15న ఏలూరులో జరిగిందన్నారు. జిల్లా కమిటీలో గణపవరం, నిడమర్రు మండలాల నుంచి ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షుడు కె.సుబ్బరాజు, జాయింట్ సెక్రటరీ ఎ.రఘురామ్‌లను, జిల్లా కమిటీ సభ్యులుగా వచ్చిపులుసు నాగేశ్వరరావు, సీహెచ్.రవికుమార్, కె.రాంబాబు, ఎస్.ఉమామహేశ్వరరావులను స్థానిక సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. గణపవరం నిడమర్రు మండలాల సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ



పెనుగొండ, జూన్ 23: వడలి గ్రామంలో ఆదివారం ఎన్‌టీఆర్ కూడలి వద్ద అక్షయపాత్ర సభ్యులు ఆహార పదార్థాలను పేదలకు అందజేశారు. సిద్ధాంతంకు చెందిన నాదెండ్ల మురళీకృష్ణ ఇంటి వద్ద జరిగిన ఫంక్షన్‌లో మిగిలిన ఆహార పదార్థాలను సభ్యులు సేకరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, మేకా సురేష్, మేకా నరసింహమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

వీర సీతారామరాజు ట్రస్టు ప్రోత్సాహకాలు



మొగల్తూరు, జూన్ 23: విద్యలో ప్రతిభ కనబర్చే పేద విద్యార్థినిలకు పేరు పొలెంకు చెందిన వీర సీతారామరాజు ట్రస్ట్ ప్రతీ ఏటా ప్రోత్సాహకాలు అందిస్తున్నది. ఈ ఏడాదిలో పదవ తరగతిలో 450 మార్కులు పైబడి సాధించిన మొగల్తూరు మండలానికి చెందిన 50 మంది అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన బాలికలకు ఒక్కొక్కరికి రూ.2వేలు నగదు, జ్ఞాపికలను ఆదివారం అందించారు. స్థానిక అందే బాపన్న జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకట రమణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ట్రస్ట్ ఛైర్మన్ బర్రి కృష్ణ మోహన్, సీతారామరాజులను అభినందించారు. ఈ ఏడాది ఐఐటిలో సీటు సాధించిన కొల్లాటి రవి చంద్రికకు రూ.5వేలు నగదు ఇచ్చి సన్మానించారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఆచంట, జూన్ 23: పాలకొల్లు టౌన్ హాస్పటల్, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎండీ జనరల్ డాక్టర్ కార్తీక్, యూరాలజిస్ట్ డాక్టర్ విజయ దుర్గ ప్రసాద్, ఎండీ డాక్టర్ శ్రీలక్ష్మి ప్రసన్న బయ్యా, ఎంఎస్ ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీహర్ష రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ రామ్మోహనరావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దాసరి కృష్ణవేణి

టీడీపీలోనే మహిళలకు రక్షణ

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 23: టీడీపీలోనే మహిళలకు రక్షణ ఉంటుందని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దాసరి కృష్ణవేణి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చీరాలలో అత్యాచారం, హత్యకు గురైన యువతి కేసులో కేవలం 36 గంటల వ్యవధిలోనే సీఎం చంద్రబాబు నాయుడు, హోంమంత్రి అనిత నిందితులను పట్టుకునే లా చేశార న్నారు. మహిళలపై దాడులు పాల్పడే వారికి ఇది ఒక హెచ్చరిక అన్నారు. హోంమంత్రి అనిత బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించడం అభినందనీయమన్నారు.

పంట కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించాలి

పెంటపాడు, జూలై 23: పంట కాల్వల్లో గుర్రపు డెక్కను తొలగించాలని సీపీఎం నాయకులు చిర్లా పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు అన్నారు. పెంటపాడులో విలేకరులతో మాట్లాడుతూ కాలువలు వదిలినా గుర్రపు డెక్క, తూడు పెరిగిపోవడం వల్ల శివారు ప్రాంతాల్లోని పొలాలకు నీరు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇరిగేషన్ శాఖాధికారులు స్పందించి గుర్రపు డెక్క, తూడు తొలగించాలన్నారు. బంకూరు నాగేశ్వరరావు, కరక వెంకట్రావు, పెనగంటి దుర్గ, అల్లు శ్రీను, సత్తినేడి బంగారయ్య పాల్గొన్నారు.

'శ్రేష్ఠ'లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23: కేంద్ర ప్రభుత్వం శ్రేష్ఠ ప్రవేశ పరీక్షల ద్వారా అత్యుత్తమ విద్యా సంస్థల్లో ఉచిత ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షల్లో పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారు. దేశ వ్యాప్తంగా 3 వేల మందికి మాత్రమే అర్హత లభించే ఈ పరీక్షలో గురుకుల పాఠశాల నుంచి 139 మంది పరీక్షలు రాయగా 139 మంది అర్హత సాధించగా 3 వేల లోపు ర్యాంకులు 40 మంది సాధించారన్నారు. మాటూరి తులసీరామ్ (410), ఎస్. హర్షవర్ధన్ (895), సీడీ రిత్విక్ దీపక్ (970), కూచిపూడి అజయ్ (1190), బీఎస్ వెస్లి (1275), యార్లగడ్డ జాన్ వెస్లి (1275) ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. వీరిని గురుకుల పాఠశాలల కార్యదర్శి మహేష్‌కుమార్, డీసీవో భారతి అభినందించారు.

రేపు వీఆర్‌ఏల సమావేశం

పెనుగొండ, జూన్ 23: పాలకొల్లు మార్కెట్ యార్డులో ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్న వీఆర్‌ఏల జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని వీఆర్‌ఏల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి. గణేశ్వరరావు కోరారు. ఆదివారం పెనుగొండలో మాట్లాడుతూ వీఆర్‌ఏల డిమాండ్‌లను, సమస్యలను చర్చించేందుకు జిల్లాలో వీఆర్‌ఏలు, మండల అధ్యక్షుడు, డివిజన్ అధ్యక్షుడు, కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

మావుళ్ళమ్మ జాతర ప్రారంభం

భీమవరం టౌన్, జూన్ 23: రెండో పట్టణంలోని 36వ వార్డు, రామరాజు తోటలో ఉన్న మావుళ్ళమ్మ 39వ జాతరను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పూజలు చేసి ప్రారంభించారు. మావుళ్ళమ్మ సేవాసమితి అధ్యక్షురాలు రామాయణం లక్ష్మీ తులసి పార్వతి, కార్యదర్శి రేవూరి గోగురా జు, కమిటీ సభ్యులు జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జిల్లా కార్యదర్శి చనమల చంద్రశేఖర్, కోళ్ల నాగేశ్వర రావు, కోమటి రవికుమార్, బండి రమేష్, గాదిరాజు తాతరాజు, చింతలపాటి బంగా ర్రాజు, పళ్లా ఏసుబాబులను సత్కరించారు.



గవర్నర్‌ను కలసిన ఎమ్మెల్యే రఘురామ

ఉండి, జూన్ 23:ఆంధ్రప్రదేశ్ గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్‌ను ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో గవర్నరును కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే అజెండా



కోదండ రామరాజు

కాళ్ల(ఉండి), జూన్ 23: ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలుగు యువత కాళ్ల మండల అధ్యక్షుడు మంతెన కోదండ రామరాజు అన్నారు. ఆదివారం జక్కరంలో విలేకరులతో మాట్లాడారు. ఉండి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అజెండాను ప్రత్యేక ప్రణాళికతో ఎమ్మెల్యే రఘురామరాజు ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలైన పంట, మురుగు కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క పూడిక తొలగింపు కోసం ఎమ్మెల్యే తన స్నేహితులతో కలిసి రూ.50లక్షలు సొంత నిధులను కేటాయించి జిల్లా కలెక్టరుతో కలిసి ప్రత్యేక అక్కౌంట్ తెరవడం గొప్ప నిర్ణయమన్నారు. మరో వైపు కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కోసం చర్యలు చేపట్టడం వంటివి చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.

బడికిపోదాంపై అవగాహన

భీమవరం టౌన్, జూన్ 23 : వెనుకబడిన తరగతుల వసతి గృహాలలో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపితే ప్రభుత్వం పుస్తకాలు, దుస్తులు ఉచితంగా అందిస్తుందని పాఠశాలల పరిశుభ్రత కో-ఆర్డినేటర్ కేవీ కృష్ణారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో బడికి పోదాంరా కార్యక్రమాన్ని వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ భనుమణి మాట్లాడుతూ 14వ తేదీ నుంచి చాలామంది బాలికలు హాస్టల్లో చేరుతున్నారని, స్వచ్ఛంద సంస్థలు కూడా అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడికి పోదాం రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు.

చిన్నారులకు భోజనం పంపిణీ

తణుకు, జూన్ 23: తణుకు స్వర్ణ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీవో కార్యాలయం రోడ్డులో చిన్నారులకు లయన్స్ క్లబ్ సేవా కో-ఆర్డినేటర్ వావిలాల సరళాదేవి, వెంకట రమేష్ దంపతులు భోజనం పాకెట్లు అందజేశారు. ఆదివారం తమ మనుమలు రుత్విక దేవి, ఈశ్వర్‌ల పుట్టిన రోజు సందర్భంగా 50 మంది చిన్నారులకు బట్టలు, వంద మందికి భోజనాలు అందించినట్లు వివరించారు. క్లబ్ అధ్యక్షుడు శేషగిరిరావు, సెక్రటరీ చిరంజీవి కుమారి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు, జూన్ 23: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా వృద్ధులకు ఆదివారం వైద్య సేవలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర తణుకు, సజ్జాపురం, దువ్వ ప్రాంతాల్లో పర్యటించి ఆరుగురికి వైద్య సేవలందించి డాక్టర్ కేవీ రావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, సభ్యులు నర్సింహారావు, గిరిజాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

తణుకు, జూన్ 23: ఛత్రపత్రి శివాజీ శోభాయాత్ర ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. తణుకు హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం (ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేకం) శౌర్య యాత్రలో పెద్ద ఎత్తున హిందువులు పాల్గొన్నారు. యాత్ర మహిళలు కోలాట భజనలు, వాయిద్యాలలో సాగింది. యువకులు మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. యాత్రలో పాల్గొన్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకులో నూతన శక్తిని కాంతిని ప్రదర్శించేలా వేడుకలు జరపడం ఆనంద దాయకమని చెప్పారు. టీడీపీ, బీజేపీ శ్రేణులు, పాల్గొన్నారు.

సేవలతోనే భగవంతుని ఆశీస్సులు



బల్లిపాడులో పీఠాధిపతి ఉమర్ అలీషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

అత్తిలి, జూన్ 23 : సేవలతోనే భగవంతుని ఆశీస్సులు పొందడానికి అర్హత పొందగలమని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా అన్నారు. ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న రెండో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని బల్లిపాడులో ఆదివారం ప్రారంభించారు. ట్రస్టు ద్వారా 'నా మొక్క - నా శ్వాస' కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటడం మొదలు పెట్టామని ఇప్పటికే ఉభయ తెలుగురాష్ట్రాల్లో అనేక లక్షల మొక్కలు నాటారన్నారు. ట్రస్టు ద్వారా దండు పద్మావతి బల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకుని ఎన్నో చక్కని సేవలు అందిస్తున్నారని వారి సేవలు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ ఉమర్ అలీషా ఆధ్యాత్మిక, సామాజిక సేవలు అందరికీ ఆదర్శమని, తాము కూడా సేవలు అందిస్తామని తెలిపారు. సర్పంచ్ పసిరెడ్డి బాల లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవకు మించిన సుగుణం లేదు

అత్తిలి, జూన్ 23 : సేవకు మించిన సుగుణం లేదని దేశీయ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు, రేలంగికి చెందిన హైకోర్టు న్యాయవాది అడవికొలను వేణుగోపాలకృష్ణ అన్నారు. అడవికొలను చారిటబుల్ ట్రస్టు ద్వారా వివిధ రంగాల్లో సేవలందించిన ముగ్గురిని సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెదపాటి గోపాలకృష్ణ ప్రసాద్‌ను, గణపవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్న లక్ష్మీనారాయణపురానికి చెందిన యండపల్లి పాండు రంగాచార్యులును, రిపోర్టర్‌గా సేవలందిస్తున్న అత్తిలికి చెందిన వి. హనుమంతరావును సన్మానించారు.

కూరగాయల ధరలు అదుపు చేయాలి

పాలకొల్లు అర్బన్, జూన్ 23: కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, కూరగాయల ధరలను ప్రభుత్వం అదుపు చేయాలని సీపీఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ కూర ధర అయిన కిలో రూ.100లకు చేరువలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వంపేదలకు సబ్సిడీపై కూరగాయలను అందించాలని డిమాండ్ చేశారు. కిరాణా, నిత్యావసరాలు ధరలు పెరిగిపోయి ఒక పక్క సామాన్యులు ఇబ్బంది పడుతూంటే మరో వైపు కూరగాయల ధరలు కూడా పెరగడంతో భారంగా మారిందన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి మంత్రి నిమ్మల పూజలు

యలమంచిలి, జూన్ 23: కొంతేరు గ్రామంలో ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి మంత్రి నిమ్మల ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయప్రాంగణంలో జరిగిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు వడ్డించారు.

సమస్యలు పరిష్కరించాలని టీచర్ల వినతి

పాలకొల్లు అర్బన్, జూన్ 23: తమ సమస్యలు మానవత్వంతో పరిశీలించాలని రాష్ట్ర జలవనుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు 98 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లు, ఎంటీఎస్ సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఆదివారం కలిసిన సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.సుబ్బారాయుడు నాయకత్వంలో వందలాది మంది మంత్రిని కలిశారు. ఈసందర్భంగా 1998లో తాము ఎంపికైనా రెండు ఏళ్ళ క్రితం మాత్రమే ఉపాధ్యాయులుగా ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, అయితే తమ వయస్సును కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 పెంచడంతో పాటు పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. దీనిపై మంత్రి డాక్టర్ నిమ్మల సానుకూలంగా స్పందించి, తన వంతు సహాయం అందిస్తానని అన్నారు.